క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సత్యం

చీపురుపల్లి: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల సంఘం అధ్యక్షుడిగా పి.సత్యం ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం రాత్రి కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఇదివరకు సంఘం అధ్యక్షుడిగా పని చేసిన సత్యనారాయణ మృతి చెందడంతో ఆయన స్థానంలో ఉపాధ్యక్షుడిగా ఉన్న సత్యంను ఎన్నుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బొండపల్లి: మార్చి 13న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలోని 101,102 పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శంకరరావు, ఎంపీడీఓ ఏ.వేదవతి గురువారం సందర్శించారు. కేంద్రంలో పోలింగ్‌కు సంబంధించి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేవా, అలాగే తాగునీరు,విద్యుత్, ఇతర వసతులను పరిశీలించారు. వారి వెంట హెచ్ఎం టి.సన్యాసిరాజు తదితరులు ఉన్నారు.

విశ్రాంత ఏడీఈ మృతి



జి.ఎస్.ఎన్.వర్మ (ఫైల్)

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్ఈసీఎస్)లో ఏడీఈగా సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి 2018లో పదవీ విరమణ పొందిన జి.ఎస్.ఎన్. వర్మ గురువారం మృతి చెందారు. పదవీ విరమణ అనంతరం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. ఈనెల 14న సిరిపురం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తలకు బలమైన గాయం కావడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. గరివిడి మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన ఈయన 1983లో ఆర్ఈసీఎస్‌లో ఉద్యోగంలో చేరి 2018లో పదవీ విరమణ చేశారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని స్వగ్రామం కోనూరుకు తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కార్మికులకు వైద్యపరీక్షలు



కార్మికులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మెరకముడిదాం: గర్భాం ఇండ్‌సిల్ హైడ్రోపవర్, మాంగనీస్ పరిశ్రమలో గరివిడి ఈఎస్ఐ ఆస్పత్రి, చీపురుపల్లి బాపూజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది కార్మికులకు వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పరిశ్రమ యూనిట్‌హెడ్ వాకాడ గోపి వైద్యసిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యాధికారి డి.మురళీకృష్ణ, ఈఎస్ఐ ప్రాంతీయకార్యాలయం మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బాపూజీ ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధి వద్దాది కిశోర్, పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్ పక్కి శ్రీనివాసరావు, స్టోర్స్ మేనేజర్ ఉప్పు శ్రీనివాసరావు, ప్రొడక్షన్ మేనేజర్ భాస్కరరావు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ పట్నాయక్ గురువారం తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల్లో ఎన్నింటిని పరిష్కరించారు, ఈ- సర్వీసులు, ఇంటి పన్ను వసూలుపై సిబ్బందిని ఆరా తీశారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు ఉన్నారు.

మూడు కొండచిలువలు హతం



యువకుల చేతిలో హతమైన కొండ చిలువలు

దత్తిరాజేరు: మండలంలోని ఎం.లింగాలవలస గ్రామ సమీపంలోని పొలాల వద్ద గురువారం సాయంత్రం మూడు కొండచిలువలను యువకులు హతమార్చారు. పొలాల వైపు వెళుతున్న కొందరు యువకులకు కొండచిలువలు కనిపించాయి. వీరు మరికొంత మందికి ఫోన్ల ద్వారా సమాచారం అందించడంతో అక్కడికి యువకులు చేరుకుని వాటిని హతమార్చారు.

విజయానికి సారథులై పనిచేయాలి

- గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో పార్టీ మళ్లీ విజ యం సాధించేలా గృహసారథులు, సచివాలయకన్వీనర్లు, నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక చెరకు కాటా వద్ద పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు అధ్యక్షతన పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహసారథులు తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించడంతో పాటు ఆయా కుటుంబాల్లో ఎవరికైనా పథకాలు అందకపోతే మంజూరు చేయించేందుకు కృషి చేయాలని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు పథకాల మంజూరులో వివక్ష చూపించడంతో పాటు లంచాలు తీసుకుని పథకాలు ఇచ్చే వారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని, రూపాయి కూడా అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలకు సంబంధించిన డబ్బులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నామని చెప్పారు.అందరికి అందుబాటులోకి విద్య, వైద్యం, ఇల్లులేని ప్రతీ పేదోడికి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు, రైతన్నలకు రైతు భరోసా ఇలా ప్రతీ వర్గానికి పథకాలు అందుతున్నాయని వివరించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

420 మంది విద్యార్థులకు కళ్లద్దాలు



వియ్యంపేట హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కొత్తవలస రూరల్: కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల్లో 420 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించామని కొత్తవలస మండలం, వియ్యంపేట పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి సీహెచ్. ఈశ్వరరావు తెలిపారు. వియ్యంపేట ఉన్నత పాఠశాల, బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలాల్లోని పాఠశాలల్లో 8,148 మంది పిల్లలకు మూడు మండలాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారని చెప్పారు. వీరిలో 420 మందికి కంటి చూపు సమస్య ఉందని, వీరిని కళ్లద్దాలకు ఎంపిక చేశామని చెప్పారు. నెల రోజుల్లో వీరికి కళ్లద్దాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు ఆకుకూరలు, పండ్లు, పాలు తీసుకోవాలని, జంక్ ఫుడ్ తినవద్దని సూచించారు. ఎంపీహెచ్ఈఓ తిరుపతిరావు, హెచ్‌వీ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు పాల్గొన్నారు.

ఎం.వెంకటాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూజ్ రాయ్

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూజ్‌రాయ్ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైద్యశిబిరంలో 55 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రం, పాఠశాలలో పిల్లలకు వైద్య తనిఖీలు చేసి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. గృహ సందర్శన చేసి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఎంఎల్‌హెచ్‌పీ శివాణి, ఆరోగ్య కార్యకర్త బేగమ్,ఆశ వర్కర్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



శివజయంతి వేడుకల్లో కేకు కట్ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి బి.కె.అన్నపూర్ణ

చీపురుపల్లి: ఆధ్యాత్మిక చింతన ద్వారానే మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి ,రాజయోగిని బి.కె.అన్నపూర్ణ చెప్పారు. పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో గురువారం శివ జయంతి మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పరమాత్మ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే సమాజం మంచి మార్గంలో నడుస్తుందన్నారు. ఒత్తిడి, అలజడులు, భయం నుంచి దూరం కావాలంటే ప్రతి ఒక్కరూ రాజయోగా అభ్యాసం చేయాలని సూచించారు. సర్వాత్మల తండ్రి పరమశివుని అవతరణకు గుర్తుగానే శివరాత్రి పండగను జరుపుకుంటారని తెలిపారు. చీపురుపల్లి సేవా కేంద్రం ఇన్‌చార్జి బి.కె.శాంతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ తీర్థం



పోటీల్లో దౌడుతీస్తున్న గుర్రం

వేపాడ: మండలంలోని కొండగంగుబూడిలో గ్రామ దేవత బంగారమ్మ తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఉత్సాహం గా ఉల్లాసంగా సాగాయి. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 13 గుర్రాలు పోటీల్లో పాల్గొనగా.. ఎల్.కోటకు చెందిన సింగపూర్ సత్యనారాయణ విరాట్ గుర్రం ప్రథమస్థానంలో నిలిచి రూ.15 వేల నగదు బహుమతి సాధించింది. తర్వాత వరుస ఆరు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధించిన రౌతులకు గ్రామపెద్దలు,ఉత్సవ కమిటీ నగదు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



గ్రామస్తులకు నగదు అందజేస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఆయన తనయుడు వంశీకృష్ణ

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి వంగపల్లిపేటలో భగీరథ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తనయుడు ,వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు వంశీకృష్ణ లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో ఎంపీ చంద్రశేఖర్ చేతులు మీదగా గ్రామ పెద్దలకు గురువారం అందజేశారు. ఎంపీటీసీ గెరిడి రామదాసు,వార్డు మెంబర్ మీసాల రామునాయుడు, గ్రామపెద్దలు వెంపడాపు నీలకంఠం,మీసాల సీతారాం,రేగిడి అప్పలనాయుడు, మహంతి ఉమ,ఇప్పిలి తిరుమల,ఆది తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను సాధించాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు

గంట్యాడ: పశు సంవర్ధకశాఖ, మహిళా సంఘాలకు సంబంధించిన రుణలక్ష్యాలను సకాలంలో సాధించాలని బ్యాంకర్లకు లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ సూచించారు. లక్కిడాం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో గురువారం సాయంత్రం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులు, డ్వాక్రా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రుణాలు మంజూరు చేసి తోడ్పాటు అందించాలని అన్నారు. అలాగే పీఎంఈజీఎఫ్ రుణాలను కూడా అందించాలని చెప్పారు. .అనంతరం సంబంధిత వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో నేలతల్లికి పునరుజ్జీవం



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతివ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు

మెరకముడిదాం: నిస్సారమైన భూముల్లో నవధాన్యాలు సాగు చేయడం వల్ల నేలతల్లికి పునరుజ్జీవం పోయవచ్చని, వీటి సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీఏబీ వై.తిరుపతిరావు అన్నారు. మండలంలోని సోమలింగాపురం పంచాయతీ మధుర గ్రామం గోపన్నవలసలో ఏపీ సీఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో నవధాన్యాల సాగుపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ముందుగా రైతులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ నవధాన్యాలను సాగుచేసి పూతవచ్చే ముందు భూమిలో కలియదున్నాలని, ఇలా చేయడం వల్ల నేలకు కావాల్సిన అన్ని రకాలపోషకాలు అందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బూరాడ శ్రీనివాసరావు, ఆర్.అప్పలనాయుడు, ఎల్.రాము, ఐ.మంగరాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



పదోతరగతి విద్యార్థుల గ్రాండ్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గరపడిందని, ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు సరైన ప్రణాళికతో సిద్ధం కావాలని డిప్యూటీ డీఈఓ కె.వాసుదేవరావు సూచించారు. గరివిడి మండలంలోని కాపుశంబాం ఉన్నత పాఠశాలను గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన తెలుగు గ్రాండ్ టెస్టును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పబ్లిక్ పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు సమయం వృథా చేయకుండా ఇప్పటి నుంచే కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమన్వయంతో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: అధికారులు, ప్రజాప్రతినిధులు అంతా సమన్వయంతో పని చేసి మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళదామని ఎంపీపీ పొట్నూరు ప్రమీల అన్నారు. మండల పరిషత్‌కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ముందుగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని 24 సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులతో పాటు అర్హులందరికీసంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. జమ్ములో చేతి పంపు మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్న పట్టించుకోవడం లేదని ఆ గ్రామ సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి సభ దృష్టికి తీసుకువచ్చారు. పెనుబర్తిలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తుమ్మగుంటి మాధవి కోరారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు తోట తిరుపతిరావు, అంబల్ల లక్ష్మి, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి, పొట్నూరు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రిజర్వ్ బ్యాంకు ఎల్‌డీఓ హనుమకుమారి

బొండపల్లి: ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని రిజర్వ్ బ్యాంకు ఎల్‌డీఓ హనుమకుమారి అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రాచకిండాం ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సదస్సులో తెలుసుకున్న విషయాలను తల్లిదండ్రులకు, గ్రామస్తులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలు రోజురోజుకు ఎక్కువవుతున్న నేపథ్యంలో డిజిటల్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పరిమితికి మించి నగదును వాడవద్దని, బ్యాంకులతో పాటు వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకున్నప్పుడు నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. లీడ్ జిల్లా మేనేజర్ ఏ.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ జిల్లా ఏపీడీ కె.సావిత్రి, హెచ్ఎం బి.అప్పన్న , ఉపాధ్యాయులు కె.ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేయడమే లక్ష్యం



రక్షాకాలనీలో పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రమణ

చీపురుపల్లి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయడం లక్ష్యంగా మొబైల్ బైక్ లైబ్రరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆశయ రూరల్ లైబ్రరీ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ తెలిపారు. పట్టణంలోని రక్షాకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నీతి కథలు, చరిత్ర, వ్యక్తిత్వ వికాసం తదితర పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో విద్యార్థుల నుంచి యువత, పెద్దల వరకు పుస్తకాలకు దూరమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి ఒక్కరితోనూ పుస్తక పఠనం చేయించేందుకు పాఠశాలలకు, ఇళ్ల వెళ్లి పుస్తకాలు అందిస్తున్నామని, నెల రోజుల తరువాత విద్యార్థులు చదివిన పుస్తకాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులు జగదీష్, వసుధ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడతాయని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో పీరుబండి ముత్యాలరావు జ్ఞాపకార్థం నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చెప్పారు. క్రీడల్లో రాణించే వారికి స్పోర్ట్స్ కోటాలో వేగంగా ఉద్యోగాలు వస్తాయని అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, టోర్నమెంట్ నిర్వాహకులు పీరుబండి లోకేష్‌కుమార్, పీరుబండి రోహిత్, పీరుబండి తేజశ్వని, పీరుబండి శిరీష పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం



భూసర్వేపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గోవింద్

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూరీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ తాడ్డి గోవింద్ కోరారు. గరివిడి మండలంలోని గదబవలస పంచాయతీలో త్వరలో భూరీసర్వే నిర్వహించనున్న నేపథ్యంలో గదబవలసలో రైతులు, స్థానిక నాయకులతో రెవెన్యూ అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు సమగ్ర భూరీసర్వేతో పరిష్కారం లభించనుందని చెప్పారు. సర్వే చేసే సమయంలో రైతులంతా తమ పొలాల వద్ద ఉండి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. భూరీసర్వేతో కలిగే ప్రయోజనాలు, సర్వే చేసే విధానాన్ని రైతులకు సమగ్రంగా వివరించారు. స్థానిక నాయకులు యల్లంటి సత్యనారాయణ, ఎంపీటీసీ యల్లంటి పోలీస్, మాజీ సర్పంచ్ సంజీవ్ పాల్గొన్నారు.

గ్రామకంఠాల సర్వే వేగవంతం



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ జనార్ధనరావు

గజపతినగరం: సమగ్ర భూరీసర్వేలో భాగంగా మండలంలో డ్రోన్ ద్వారా గ్రామాల సరిహద్దుల సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామకంఠం భూముల సర్వే వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ డి.జనార్ధనరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. డ్రోన్ సర్వే పూర్తయిన ఎం.వెంకటాపురం,ఎస్.జి.ఆర్.పురం, సీతారాంపురం, బంగారమ్మపేట, భూదేవిపేట, కాలంరాజు పేట, దోశపాలెం, చిట్టాయవలస, గుడివాడ తదితర గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాల ఆవాసాల్లో గ్రామకంఠం భూములు, ఇళ్లు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ,దేవస్థానం భూములను సర్వే చేసి రికార్డుల్లో నమోదుచేయాలని ఈఓపీఆర్డీ చెప్పారు. ఈ సర్వే మార్చి మొదటి వారానికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెలాఖరులోగా ఇంటి పన్ను వసూలు శతశాతం పూర్తి చేయాలని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం మాట్లాడుతూ స్పందనకు వచ్చిన వినతులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటిపెంట రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓ విమలమ్మ గురువారం పరిశీలించారు. విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

బైజూస్ యాప్‌పై అవగాహన

మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల్లో బైజూస్ యాప్ వినియోగంపై హెచ్ఎం డి.గౌరినాయుడు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. సీఆర్పీలు రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి



ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు సమస్య వివరిస్తున్న బాధితులు

వేపాడ: సోంపురం వయా వేపాడ-ఆనందపురం రాష్ట్రీయ రహదారి విస్తరణలో భాగంగా వేపాడలో ఇళ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ బాధితులు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు మండల కేంద్రంలో గురువారం వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా 40 అడుగుల వరకు కొలతలు వేయడం వల్ల ఇళ్ల నిర్మాణాల్లో కొంతభాగం కోల్పోతున్నామని, రోడ్డు విస్తరణను 30 అడుగులకు తగ్గించాలని, లేదంటే నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి తహసీల్దార్ కృష్ణంరాజుతో ఫోన్‌లో మాట్లాడారు.రోడ్డు వెడల్పు తగ్గించడం కాని పరిహారం ఇప్పించే విషయం కాని ఆర్అండ్‌బీ అధికారులతో సంప్రదించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.